



# కొత్త జీవితం

ఆకుమళ్ళ పద్మరాజ్యలక్ష్మి

మానస మనసు మనసులో లేదు. ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

దూరంగా ఎక్కడో పెళ్ళి జరుగుతోంది బాజా భజంత్రీలు మ్రోగుతున్నాయి. ఆ మేళతాళాల శబ్దాలు వింటూ ఉంటే మానస హృదయం దుఃఖంతో రోదిస్తుంది.

లోకంలో అందరమ్మాయిలూ ఎలా బ్రతుకుతున్నారు. తనెలా బ్రతుకుతోంది? తనకు మాత్రం అందరాడపిల్లల్లా బ్రతకాలని ఉండదా? తనేం నేరం చేసిందని తనకీ శిక్ష? అసలు ఈ పెద్ద వాళ్ళకి బుద్ధి లేదు. తనకి చిన్నతనంలోనే ఎందుకు పెళ్ళి చేయాలి? తన భర్త సోమేశ్వరం పదిహేనేళ్ళకే కేన్సర్‌తో చనిపోవాలా? అంతా తన ఖర్మ పన్నెండేళ్ళకే విధవగా మారిపోయింది తను. మోడువారిన ఈ జీవితం ఎందుకు? తను ఎన్నాళ్ళు ఈ విధంగా గడపాలి?

గాఢంగా నిట్టూర్చింది మానస.

ఇంతలో గడియారం ఏడు గంటలు కొట్టింది.

మానస తేరుకుంది. బిందె తీసుకుని చెరువుకు బయల్దేరింది.

ఊరు నిద్ర లేచి కాసేపే అయినట్లుంది, వీధుల్లో జనసంచారం మొదలైంది. నీళ్ళ కోసం చెరువుకి వెళ్ళేవాళ్ళు, పాల గిన్నెలతో ఇంటింటికి తిరిగేవాళ్ళు, కూరగాయలు గంపల్లో అమ్మే వాళ్ళు.... సందడి మొదలైంది.

బిందెతో నీళ్ళు తీసుకుని తిరుగు ముఖం పట్టింది మానస.

"ఏమండీ!" అని వినిపించి వెనుదిరిగి చూసింది.

ఒక యువకుడు. వయసు పాతిక ఉండవచ్చు. చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నాడు.

"నా పేరు మధు.... మధుసూదనరావు, ఈ ఊరికి క్రొత్తగా టీచరుగా వచ్చాను. నాకు ఉండటానికి ఓ ఇల్లు.... కనీసం ఓ గది అద్దెకు కావాలి. మీకు తెలిసి ఎక్కడన్నా పోర్షన్ ఖాళీగా ఉంటే చెప్పండి" అన్నాడు.

"మా ఇంట్లో ఓ గది ఖాళీగా ఉంది. సాయంత్రం వచ్చి మా నాన్నగారితో మాట్లాడండి" అంటూ ఇంటి గుర్తులు చెప్పింది మానస.

"థాంక్సండీ!" చెప్పాడు మధుసూదనరావు.

ముందుకు సాగుతూ కాస్త దూరం నడిచాక వెనుదిరిగి చూసింది మానస. మధుసూదనరావు ఇంకా అక్కడే నిల్చుని ఉన్నాడు. మానస వెనుదిరిగి తనని చూడగానే చిరునవ్వు నవ్వాడు.



తెల్ల మొసలిని పట్టిన ఫోటోగ్రాఫర్లు

స్టూడియోలో కూర్చుని బటన్ నొక్కినట్టు కాదు అడవుల్లోని జంతువుల ఫోటోలు తీయటం. అదెంత కష్టమైన పనో ఈ ఇద్దరు ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్లకీ బాగా తెలుసు. ఈ ఫోటోగ్రాఫర్లు జార్జిగ్రావ్, జోయెన్ సర్టోర్ ఫోటోలు తీయటానికి చాలా కష్టపడేవారు. సముద్రంలో మునిగి ఈదుతూ, అడవుల్లో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని తిరుగుతూ ఫోటోలు తీస్తూ వుంటారు వీరిద్దరూ. జార్జి చిన్నతనంలో పాములు, తాబేళ్లు పట్టి అమ్మి డబ్బు సంపాదించే వాడు. అలా వచ్చిన డబ్బుతోనే తన మొదటి కెమేరా కొన్నాడు. ఈమధ్య ఈ ఫోటోగ్రాఫర్లు ఇద్దరూ చాలా క్లిష్టమైన అన్వేషణ తర్వాత లుధియానా సమీపంలో ఈ 'తెల్ల మొసలి'ని పట్టుకున్నారు.

- బి.ఆర్. సుంకర

మానస నవ్వనూ లేదు, ముఖం చిట్లించనూ లేదు. మామూలుగా ముఖం తిప్పుకుని ముందుకు సాగింది.

ఇంటికి వెళ్ళినా ఆ యువకుని చిరునవ్వే గుర్తుకు వస్తోంది. ఎందుకో ఆ యువకుడి చిరునవ్వు, తీరు వెకిలిగా తోచడం లేదు. మాట్లాడేటప్పుడు అతని కళ్ళల్లో మర్యాద ఉంది. అతనిలో ఏదో ఆకర్షణ ఉంది.

సాయంత్రం వస్తాడా!

మానస మనసు తనకి తెలియకుండానే అతని కోసం ఎదురు చూడసాగింది.

మానస కొన్ని రోజులు పుట్టింట్లోను, కొన్ని రోజులు అత్తగారింట్లోను ఉంటుంది. మానసకు తండ్రి తప్ప ఎవరూ లేరు. తండ్రి రిటైరయిన తెలుగు పండిట్. ఆయన కొచ్చే పెన్షన్‌తో పాటు ఇంటికి ట్యూషన్ కొచ్చే పిల్లలు ఇచ్చే డబ్బుతో ఇల్లు గడుస్తుంది.

మానస తండ్రి ధర్మారావు పేరుకు తగ్గట్లు ధర్మాత్ముడు. గొప్ప ఉదార స్వభావుడు. కూతురికి మళ్ళీ పెళ్ళి చేద్దామన్న ఆలోచన ఆయనకి లేక పోలేదు. కానీ మామూలు ఆడపిల్లలకే ఇంతలేసి కట్నాలు అడుగుతున్నారు. ఇక భర్త చనిపోయిన స్త్రీని చేసుకోవడానికి ఎవరు ముందుకు వస్తారు, వచ్చినా ఎంత లేసి కట్నకానుకలు అడుగుతారో అని వెనుకంజ వేస్తున్నాడు.

సాయంత్రం అయిదు గంటలు కావస్తోంది. వరండాలో నీరెండ ఆవరించుకుంది. చల్లని గాలి వీచసాగింది. సన్నని తుంపరగా వర్షం ప్రారంభమయింది.

వర్షం వస్తే అతను వస్తాడో రాడో?

మానస మనసులో వెలితి ఏర్పడింది.

ప్రైవేటు పిల్లలు ఒక్కొక్కరే రాసాగారు.

మానస ఇల్లంతా కసువు తోసింది. పాలు కాచి, కాఫీ పెట్టి, తండ్రికి ఇచ్చి తనూ త్రాగింది.

పెరట్లో పూలు కోసి మాల గ్రుచ్చుతూంటే బయట ఎవరివో మాటలు వినిపించాయి.

మాల కడుతూ బయటికి వస్తే మధుసూదన రావు కనిపించాడు.

మానస మనసు ఆమెకి తెలియకుండానే సంతోషంతో వికసించింది.

"నీవు రంగనాథంగారబ్బాయివా? మరి ఆ మాట చెప్పవేం? రంగనాథం నా బాల్య స్నేహితుడు. నీవు లక్షణంగా ఇవాల్టి నుంచే మా ఇంట్లో చేరిపోవచ్చు" అంటున్నాడు ధర్మారావు.

"చాలా థాంక్సండీ!"

"అమ్మాయ్!"

"ఏమిటి నాన్నా?"

"ఇతను నా బాల్య స్నేహితుడు రంగనాథం కొడుకమ్మా! వీళ్ళ నాన్న, నేను చిన్నప్పుడు గోలీలు ఆడుకునే వాళ్ళం. ఈ అబ్బాయి ఇవాళ్టినుంచీ మనింట్లోనే ఉంటాడు. గది చూపించమ్మా"

"అలాగే నాన్నా!" అని అతని వైపు చూసి "రండి" అంటూ ముందుకు దారి తీసింది మానస.

ఆమెని అనుసరించాడు మధుసూదనరావు.

గదిచూపించి "మేము ఈ గది వాడటం లేదు. కాస్త దుమ్ము ఉందండీ!" అంది మొహమాటంగా.

"ఫరవాలేదండీ! నేను దులుపుకుంటాను" అన్నాడతను.

మానస ఇవతలికి వచ్చేసింది.

మధుసూదనరావు అడ్వాన్సు ఇవ్వబోతే డబ్బుతో ఎంతో అవసరమున్నప్పటికీ తిరస్కరించాడు ధర్మారావు.

ఇంట్లో చేరిన మూడు రోజులకే తండ్రీ కూతుళ్ళిద్దరికీ ఎంతో చేరువైపోయాడు మధు.

ఉదయం స్కూలుకు వెళ్ళకముందు తనకు తెచ్చుకుంటూ అలాగే వారికి కూడ తెస్తాడు కూరగాయలు. డబ్బులిస్తే తీసుకోడు.

"నీ కొక్కడికీ చేయి కాల్చుకోవడమెందుకోయ్? మా ఇంట్లోనే భోంచేసెయ్" అన్నాడు ధర్మారావు

మధు అంగీకరించాడు.

ఒక రోజు నాటకరాయుళ్ళు వచ్చి రాత్రి నాటకం వేస్తున్నామని, ముఖ్య అతిధిగా రావాలని ధర్మారావుని ఆహ్వానించి వెళ్ళారు.

మానసకి కూడా వెళ్ళాలనిపించి తండ్రితో పాటు బయలుదేరింది. మనసుపడి బొట్టూ, కాటుక పెట్టుకుంది. తల్లో పూలు పెట్టుకుని మంచి చీర కట్టుకుంది.

తండ్రీ కూతుళ్ళతో పాటు మధు కూడా బయలుదేరాడు.

మానసని చూసి పల్లె పల్లెంతా బుగ్గలు నొక్కుకుంది.

కొంతమంది ముఖం మీదనే అనేశారు - "ఏమమ్మా మానసా, ఇదెక్కడి చోద్యమమ్మా? భర్త చనిపోయిన స్త్రీవి బొట్టు, కాటుక పెట్టుకుని పూలు సింగారించుకుంటావా? హవ్వ ఎంత అపచారం?"

మానసకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మా అమ్మాయి ఎలా ఉంటే మీకెందుకు? నోళ్ళు మూసుకుని మీ దారిన మీరు వెళ్ళండి" గదిమాడు ధర్మారావు.

"అయ్యో! పెద్దవాళ్ళంకదాని మంచి చెప్పబోయాం. ఆచారమంటే ఆచారమే.. పాటించకపోతే మాదేం పోయింది?" అన్నారు వాళ్ళు.

ధర్మారావు ఏదో చెప్పబోతే మధు కలగజేసుకున్నాడు. "చూడండి, పెద్దవాళ్ళమంటున్నారు. పెద్దరికం బుద్ధితో వస్తుంది కానీ వయసుతో రాదు. ఆచారం, ఆచారం అంటున్నారు. కానీ బాల్యంలోనే పెళ్ళి అయి, భర్తపై ఒక అవగాహన కూడా ఏర్పడకుండానే ఆ భర్త చనిపోతే ఆమె జీవితాంతం విధవగా ఉండాల్సిన అవసరం లేదు. మానస అలంకార వస్తువులు ధరించటానికి, అందరాడ పిల్లల్లా బ్రతకడానికి ఎంతైనా అర్హురాలు. మళ్ళీ పెళ్ళి చేసుకోవడానికి కూడా యోగ్యురాలు. అయినా భార్యని పోగొట్టుకున్న భర్తకు లేని ఆచారాలు ఆడదానికి ఎందుకు విధించాలండీ... ఆ రోజుల్లో పురుషాధిక్యతని చాటుకోవడానికి కొందరు చాందసులు సృష్టించిన ఇవి ఈ రోజుల్లో చెల్లవు"

"భర్త చనిపోయిన స్త్రీని ఎవరు చేసుకుంటారు? ఎవరు ముందుకు వస్తారు? ఆదర్శాలు అందరూ వల్లిస్తారు. కానీ పాటించేదెవరు? అంతగా నీతులు చెబుతున్నావు, అంత ఆదర్శవంతుడివైతే నువ్వే ఆమెని చేసుకోరాదూ?" అన్నారు అమ్మలక్కలు.

కాసేపు తండ్రీ కూతుళ్ళు నోట మాట రాక ఉండిపోయారు. వారి మౌనాన్ని ఛేదిస్తూ మధు అన్నాడు - "నాకా ఉద్దేశం ఎప్పటినుంచో ఉంది. కానీ వారి అభిప్రాయం తెలియదుగా, అందుకే మౌనంగా ఉన్నాను. వారి కభ్యంతరం లేకపోతే మానసని ఇప్పుడే ఈ క్షణంలోనే పెళ్ళి చేసుకుంటాను."

"బాబూ!" ఆశ్చర్యానందాలతో చూశాడు ధర్మారావు.

"మీ అల్లుడిని కావటానికి మీకు గానీ, మీ అమ్మాయికి గానీ ఏమన్నా అభ్యంతరమా మేష్టారూ?"

"లేదు బాబూ! లేదు. నేను వింటున్నది కలా, నిజమా అని ఆశ్చర్యపోతున్నాను."

"మీ అమ్మాయి అభిప్రాయం కనుక్కోండి"

మానస చటుక్కున వంగి మధు పాదాలకి నమస్కరించబోయింది.

మధు వారించి పైకి లేవనెత్తాడు, ఆమె వైపు ప్రేమగా చూస్తూ.